గీత్‌మాల క్యాసెట్ గెలుపొందిన కథ

# సంస్కారం

## గొల్లపూడి రాజ్యలక్ష్మి

**ఇల్లు దగ్గరపడుతున్నకొద్దీ లలితకు అలసట మరింతగా అన్పిస్తోంది. ఇంట్లో తనకోసం ఎదురుచూసే పన్లను తలుచుకుంటే దిగులేస్తోంది. అందులో ఈవేళ ఆఫీసు పని ఒత్తిడితో విసిగిపోయి తల నొప్పి కూడా వచ్చింది.**

సిటీబస్ కోసం ఎదురుచూడటంతో మరింత అలసట. ఏదైనా హోటల్‌కెళ్ళి మాత్ర వేసుకుని కాఫీ తాగాలని ఎంతగానో అనిపించిందామెకు. ఆ కాస్త వ్యవధిలోనే బస్ మిస్ అయిపోతుందేమో అన్న భయంతో స్టాప్‌లోనే నీరసంగా నిలబడిపోయింది. ఆ బస్ తప్పితే మళ్ళీ అరగంట దాకా లేదు. ఇంటికి మరింత ఆలశ్యం అవుతుంది. అందుకే ఆ రద్దీలోనే వేలాడుతూ ప్రయాణించింది.

ఎప్పట్లా వాకిట్లోనే ప్రత్యక్షమయ్యే సరళ, సారధిలు లేకపోవడం ఆశ్చర్యమనిపించింది. నేరుగా గదిలోకి వెళ్ళి, బట్టలు మార్చుకుంది. ఎదురుగా కనిపిస్తున్న మంచం మీద కళ్ళు మూసుకొని పడుకొందామనుకున్నా, ఇంట్లో పని తలుచుకుని నిట్టూర్చి మొహం కడుక్కోడానికి పెరట్లో కెళ్ళిందల్లా అక్కడి దృశ్యం చూసి కొయ్యబారి పోయింది. దొడ్లో బాదం చెట్టు కింద అత్తగారు, ఆడబడుచు, మరిది మంచంమీద పరివేష్టించి ఎందుకో తెగ నవ్వుతున్నారు. ఎదురుగా మాతి చప్టామీద కూర్చున్న చలపతి గాన కచేరీ చేస్తున్నాడు. వాళ్ళ నవ్వుల్ని చూసి మరింతగా హుషారుగా అపశృతులతో నిండిన గొంతుతో నిర్భయంగా పాడుతున్నాడు.

కోడల్ని చూసిన అత్తగారు ఒక్క క్షణం నవ్వు ఆపి, "వచ్చావా? కాస్త కాఫీ కలుపు. తల బద్దలైపోతోందిగంట నుంచీ, వస్తున్నాను కాఫీ నీళ్ళు పోసే దిక్కులేక" అన్నది. లలిత ఆ మాటల్ని పట్టించుకోక చలపతి వంకే చూస్తున్నది.

నెలరోజుల్నాడు చేసుకున్న గడ్డంతో, గుంటలుపడిన కళ్ళతో, పీక్కుపోయిన చెంపలతో, తైల సంస్కారం లేక అట్టలుకట్టిన జుట్టుతో, ఆ గుడ్డలు మురికితో పీలిక లయి, గోరీలోంచి లేచి వచ్చిన శవంలా ఉన్నాడు చలపతి.

గొంతు హీన స్వరం పడింది. అయినా ఉత్సాహంతో పాడుతున్నాడు పరిసరాలతో ప్రమేయం లేనట్టు.

లలిత కళ్ళు నీళ్ళతో బరువెక్కాయి.

ఆరు నెలల నుంచీ అజాపజా లేని చలపతి యిప్పుడు... యిక్కడ... యిలా...

ఎన్నో అడగాలని ఉంది. అయినాఅడగలేక పోతోంది.

గీత్‌మాల క్యాసెట్ గెలుచుకున్న కార్టూన్




"విన్నేవే... ఆవక తిరిగ్గా వాడిని చూడొచ్చు. ముందు వంటిట్లోకి తగలడు..." అని కఠోరంగాఅరిచి- "ఒతే, చలపాయ్! కాదుసుమా కల కాదు సుమా పాడరా!" అంటూ ఉత్సాహ పడింది. కళ్ళు తెరిచి ఆమె వంక చూసి ఓ వెర్రి నవ్వు నవ్వి మళ్ళీ గొంతు విప్పాడు.

ఇంక అక్కడ నిలబడలేనట్లు గబగబా బాత్‌రూమ్‌లోనికి వెళ్ళింది లలిత. కళ్ళు ప్రవాహాలయినాయి. 'ఇక్కడికెందుకొచ్చాడు? ఏముందని? ఎవరి కోసం?' ఆమె గుండె ఆరాటంతో ఎగసి పడుతోంది. కణతలు బద్దలైపోతున్నాయి. గబగబా కాళ్ళు కడుక్కుని స్టౌ దగ్గర కెళ్ళింది. డికాషన్‌కి నీళ్ళు పడేసింది. కాఫీతయారయ్యే సరికి పది నిమిషాలు పట్టింది. ఇంతసేపూ చలపతిని వాగిస్తూనే ఉంది లలిత అత్తగారు. మరిది, ఆడపడుచూ వినోదంగా నవ్వుతున్నారు. కాఫీ గ్లాసు అత్తగారికి అందించి, చలపతి దగ్గరకొచ్చి "లోపలికెళ్ళరా అన్నయ్యా!" అన్నది లలిత ఆప్యాయంగా. ఏ భావమూ లేకుండా చెల్లెల్ని చూస్తూ పిచ్చి నవ్వు నవ్వాడు చలపతి.

ఇంక అతనక్కడి నుంచి లేవడని తెలుసు.

అందుకే దగ్గరకెళ్ళి రెక్కపట్టి లేపుతూ, "రా... అన్నం తిందువుగాని! ముందు స్నానం చేద్దూగాని... లే అన్నయ్యా!" అన్నది బుజ్జగిస్తున్నట్లు.

అతని కళ్ళల్లోకి వెలుగు వచ్చినట్లయింది.

"ఆకలిగా ఉంది. అన్నం పెడతావు కదూ!" అన్నాడు ఆత్రంగా.

మాణిక్యాంబ ముఖం ముదుచుకుంటూ—"అన్నం ఎక్కడిదీ? వంట చేశావా అప్పుడే?" అన్నది.

"పొద్దుటి అన్నం మిగిలి ఉంది. అది తింటాడు లెండి!" అన్నది లలిత. "ఇందాకట్నించీ ఆకలో రామచంద్రా అని అఘోరిస్తున్నావుగాదుటే, పోయి తిన రాదూ?" అన్నది కూతుర్ని ఉద్దేశించి మాణిక్యాంబ.

తల్లి భావం గ్రహించినదానిలా సరళ లేచి వంటింట్లోకి వెళ్ళింది. లలిత క్షణం సేపు అయోమయంగా నిలబడి పోయింది. 'అంటే అర్థం ఏమిటి? అన్నం ఇతనికి పెట్టడం ఇష్టం లేకనే కదూ!' లలిత ముఖం రోషంతో ఎర్రబడింది. కుర్చీ చూపిస్తూ కూర్చో అన్నయ్యా! పది నిమిషాలలో వంట చేస్తాను"

అంటూ హడావిడిగా వంట కార్యక్రమంలో పడింది.

వంట గదిలో అయిష్టంగా అన్నం కెలుకుతూ కూర్చున్న ఆడపడుచు సరళను చూసి నిట్టూర్చింది.

తల్లి మాట కోసం కూర్చుంది గానీ, ఈవేళప్పుడు ఎప్పుడైనా భోజనం చేసినదేనా? ఏదోవిధంగా తనను అవమానించి, బాధ పెట్టడం ఈ ఇంట్లోవాళ్ళకి ఆటగా మిగిలిపోయింది. వీళ్ళ దృష్టిలో తను మనిషి కాదు. మర బొమ్మ. అటు ఆఫీసు పని, ఇటు ఇంటి పని చేసి తన శక్తినంతా వీళ్ళకు ధారపోసి వ్యక్తిత్వం చంపుకుని జీవచ్ఛవంలా బతుకుతున్నా ఇంకా తన సహనాన్ని పరీక్షిస్తూనే ఉంటారు. ఎందుకు తనని హింసించడం? తను చేసిన నేరం ఏమిటి?

సరళ అన్నంలో నీళ్ళు పోసి లేచిపోయింది. కంచం నిండుగా మిగిలివున్న అన్నం వంక నిస్సహాయంగా చూసింది లలిత.

"ఎప్పుడొచ్చావ్? ...లే ...లే బుద్ధిలేదూ? దీనిమీద ఎవరు కూర్చోమన్నారు నిన్ను? లలితా! సరళా!" అంటూ అరుస్తూ ప్రవేశించాడు రామ్మూర్తి.

లలిత హాల్లోకెళ్ళింది.


ఒక మూల ఒదిగిపోయి భయంగా రామ్మూర్తి వంక చూస్తూ నిలబడి ఉన్నాడు చలపతి.

"మీరంతా ఎక్కడ చచ్చారు? వీడ్ని లోపలికెందుకు రానిచ్చారు? ఆ గుడ్డలూ, వాడూ... ఛీఛీ... ఇది కొంపా? పిచ్చాసుపత్రా?" విసుక్కుంటూ తీవ్రంగా లలితవైపు చూసి గదిలోకెళ్ళాడు రామ్మూర్తి. సరళ లలితవైపు నిందా గర్వితంగా చూసి తనూ తల్లి దగ్గర కెళ్ళింది. గోడ కంటుకుని బిత్తరగా చూస్తున్న చలపతిని చూస్తుంటే దుఃఖమూ, రోషమూ పోటీ పడినయ్ లలితలో.

గబగబా బకెట్లో చన్నీళ్ళు తోడి బాత్‌రూంలో పెట్టి, చలపతిని బాత్‌రూంలోకి నెట్టి "స్నానం చేసిరా అన్నయ్యా!" అంది గాద్గదికంగా.

పాత బట్టల మూట తీసి, అందులో రామ్మూర్తి చిరిగిపోయిన పైజమా, బనీను బయట పెట్టింది. అన్నం వార్చి, గబగబా వంకాయలు తరిగి తిరగమోతలో వేసింది. చారు సిద్ధం చేసింది సరళ వదిలేసిన కంచం






తీసి పెరట్లో కెళ్ళింది. అప్పుడే బాత్‌రూంలోంచి వచ్చిన చలపతి లలిత చేతిలోని కంచం చూసి, ఆత్రంగా దగ్గరకు వచ్చి తీసుకోబోయాడు.

"ఛీ... ఇది వద్దు. లోపలికి పద. వేడి అన్నం పెడ్తాను" అన్నది బాధను దిగ మింగుతూ.

ఎప్పుడు చేరాడో తల్లి దగ్గరకు మూర్తి– అతను, సరళ, మరిది పెద్దగా నవ్వుతున్నారీ ఘట్టాన్ని చూసి. మాణిక్యాంబ చేతులు తిప్పుతూ ఏదో చెప్తోంది.

ఇందులో నవ్వే విషయం ఏముందో అర్థం కావడం లేదు లలితకి. కంచంలోని అన్నం కుడితి కుండలో పోస్తుంటే చూస్తూ నిలబడిపోయాడు చలపతి. అతని కళ్ళల్లో ఆకలి శివతాండవం చేస్తోంది. ఇంతలో రామ్మూర్తి— "వచ్చి ఇంతసేపయ్యింది. కాఫీ ఇవ్వడానికి నీకింకా తీరలేదా? అసలు నేనంటే లక్ష్యం ఉందా నీకు?" కళ్ళు ఉరుముతూ చూశాడు.

లలితకు జవాబివ్వాలనిపించలేదు. లోపలికెళ్ళింది చలపతితో. తడిగా ఉన్న చలపతి తల తుడిచింది. పైజమా, బనీను వేసుకోమని ఇచ్చింది. వంట గదిలో పీట వాల్చింది. కంచం పెట్టింది. ఈ లోగా రామ్మూర్తి కాఫీ కోసం గావుకేక పెట్టడంతో కాఫీ కప్పుతో అతని దగ్గరకెళ్ళింది.

"ఊఁ....అన్నగార్ని చూడగానే ఒళ్ళు తెలియడం లేదన్నమాట" అన్నాడు లలితను నఖశిఖ పర్యంతం చూస్తూ.

"పిచ్చోడైతేనే ఇంత చిడిసిపాటుగా వుంది. ఇంక అన్ని లక్షణాలు ఉన్నవాడైతే... భూమ్మీద నిలిచేదేనా? నీతో కాపురం చేసేదేనా?" అన్నది మాణిక్యాంబ సాగదీస్తూ. ఒకదానికొకటి పొంతనలేని మాటలు.

"ఎందుకండీ ఇన్నిరకాల మాటలు? ఇప్పుడు నేనేం చేస్తున్నానని? ఇన్నాళ్ళకు మా అన్నయ్య ఈ గడప దగ్గర కొచ్చాడు. పిడికెడన్నం పెడుతున్నాను. అదేమంత తప్పు కాదే?" అన్నది లలిత అసహనంగా చూస్తూ.

"నోర్ముయ్. మేమేదో నిన్ను అనరాని కూతలు అన్నట్లు... నువ్వు చేసేది కన్పించదు గానీ! ఏ రోజన్నా ఇంత శ్రద్ధగా నాకు స్నానానికి నీళ్ళించావా? అన్నం వండి పెట్టి పిలిచావా? అన్నింటికీ నేను అరిచి గోల చేస్తే, తద్దినం పెడ్తున్న మొహంతో తగలెడతావు. నీ అహంకారం ఏం చూసుకునో నాకు తెలుసు. నాలుగు రాళ్ళు సంపాదిస్తున్నందుకేగా! బోడి సంపాదన..." లలిత మనస్సు చివుక్కు మంది. 'నోటి కెంతొస్తే అంతా అనేయడమేనా? ఏమిటీ మనిషి? ఇన్ని మాటలు ఇష్టమొచ్చినట్టు అంటున్నారే? తిరిగి తనొక్కమాట ఎదురు అంటే ఏమైపోతారు వీళ్ళు? బోడి సంపాదనట! ...హు ...ఆ సంపాదన చూసేగా తనను పెళ్ళి చేసుకుంది. ఆ సంపాదనే లేకపోతే ఇంకా ఎంత హీనమై పోయేదో... చిన్నప్పట్నుంచీ సర్దుకుపోయే గుణం, సహనం తనకు అలవడటంతో వీళ్ళకి ఎదురుచెప్పలేక పోతోంది.'

అతనికి సమాధానం చెప్పడం అనవసరం అనిపించి తిరిగి వంట గదిలోకి వెళ్ళిపోయింది. వేయించిన అప్పడాలు ఎత్తుకెళ్ళి సరళ, సారథిలు కరకర నములుతున్నారు. అన్నయ్య విస్తట్లో వేద్దామంటే ఒక్కటి లేదు.

'ఆ అప్పడాలంటే చలపతికి ఎంత ఇష్టం! అప్పడాలు వత్తి రోజూ వాడికి వేయించి వేసేది అమ్మ. చలపతిని ఎంత ప్రేమగా చూసేది అమ్మ! ఎంత తెలివితేటలుగా ఉండేవాడు! ప్రతి క్లాసులో ఫస్టు వచ్చేవాడు. ఎప్పుడు చూసినా పుస్తకాల్లో తలదూర్చి చదువుతూండే వాడు. లేదా అమ్మ దగ్గర కూర్చుని కబుర్లు చెప్పడం... తను చెల్లెలయినా తనతో అంతగా ఆడటం గానీ, మాట్లాడటం గానీ తక్కువే. వాడికి స్నేహితుడు, గురువు అన్నీ అమ్మే. పెద్దవాడైనా కాలేజీకి వచ్చినా ఎప్పుడూ అమ్మ దగ్గరే ఉండి అమ్మ వెంటే తిరుగుతూండేవాడు...

'అమ్మకి పనులలో సాయం చేస్తున్నప్పుడు ' లలితకి పనంటే వచ్చే బద్ధకం. నువ్వు నా మనసెరిగి సాయం చేస్తావు... అది మగాడిగా, నువ్వు ఆడదానిగా పుట్ట వలసిందిరా! ' అనేది అమ్మ. అటువంటి అమ్మ, చలపతి ప్రాణప్రదంగా ప్రేమించి దేవతలా చూసుకునే అమ్మ, లోకంలో అమ్మ తప్ప మరే ఇతర ప్రాణీ లేనట్టు భావించే చలపతిని అమ్మ మరణం బాగా కృంగదీసింది. ఆమె మరణమే అతని మతి భ్రమణానికి అంకుర మయింది!'మళ్ళీ మూకుడు పెట్టి అప్పడాలు వేయిస్తున్న లలితకు అవన్నీ గుర్తుకు రాసాగాయి. ' వాడి గురించి నాన్నగారు ఎన్ని వైద్యాలు చేయించారు! ఎంత డబ్బు ఖర్చు చేశారు! అమ్మ పోవడం, వాడికి మతి చలించడం, పెళ్ళికి ఎదిగి కూర్చున్న తనకు పెళ్ళి సంబంధాలు ఒక్కటీ కుదరక పోవడంతో నాన్నగారికి మనోవ్యాధి పట్టుకుంది. ఎట్లాగో తను డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగంలో చేరింది. అటు నాన్నను, ఇటు చలపతినీ చూసుకోవడం, ఆఫీసు పని, ఇంటిపనితో సతమతమయ్యేది. ఉన్నట్టుండి చలపతి పారిపోవడంతో నాన్నకు హార్ట్ ఎటాక్ రావడం, ఆ బెంగకు తోడు తనకు పెళ్ళి కాకపోవడం మరింత దిగులుగా మారి, రెండవసారి తీవ్రంగా హార్ట్ ఎటాక్ వచ్చి పోవడంతో ఒంటరిగా మిగిలింది తను. పాపం నాన్నగారి ఫ్రెండ్ పట్టాభిగారు ఒంటరిదాన్నయిన తన్ని ఆదుకుని ఈ 'దివ్యమైన సంబంధం' కుదిర్చారు. ఈ మూర్తి ఆనాడు ఎంత ఆదర్శంగా, ఎంత వినయంగా మాట్లాడాడు. కట్నం వద్దన్నాడు. పిల్ల చాలన్నాడు. తేనెపూసిన కత్తి! '

లలిత మనసంతా జుగుప్సతో నిండిపోయింది.

వేయించిన అప్పడాలు విస్తట్లో వేసింది.

' ఇంకా రాలేదేం వీడు? ' అనుకుంటూ పెరట్లో కెళ్ళింది. బాత్‌రూంలో లేదు. ముందు గదిలోనసారా ఎక్కడా కన్పించలేదు.' ఏడీ?' లలిత ఆత్రంగా, అయోమయంగా తిరిగి తిరిగి చూసింది. మళ్ళీ పెరట్లోకెళ్ళి "మా అన్నయ్య ఏడీ?" అన్నది రామ్మూర్తినుద్దేశించి.

చల్లా సుబ్రహ్మణ్యం రచన
సర్కస్ సర్కస్
కొత్త సీరియల్ త్వరలో

'ఎందుకు? వస్తాదులే. నాకు తల పగిలిపోతోంది. అమృతాంజనం ఇవ్వుకాస్త'' అన్నాడు మాటమారుస్తూ.

''వాడు చాలా ఆకలితో ఉన్నాడండీ పాపం....'' ఏదో చెప్పబోయింది లలిత.

''చాల్లే. నన్ను విసిగించకు! ఎక్కడో అక్కడ అడుక్కు తింటాడులే. ఇన్నాళ్ళూ అదేగా వాడు చేసిన పని! అసలు నిన్ననాలి. ఇష్టమొచ్చినట్టు అడ్డమైన వాళ్ళకి వండి వార్చడానికి ఇక్కడేమన్నా మీ తాత ముల్లె ఉందా?''

లలిత కాస్త తీక్షణంగా చూసింది. ఇక నిగ్రహించుకో లేకపోయింది.

''ఎక్కడకు పంపించారు? చెప్పండి?'' అన్నది దాదాపు అరచినట్లే నిలదీస్తూ.

రామ్మూర్తి, మాణిక్యాంబ, సరళ, సారథి అంతా లలితవైపు వింతగా చూశారు.

''ఏమిటిలా నిలదీస్తున్నావ్? నీకుచెప్పాల్సిన అవసరం లేదు, చెప్పను'' రామ్మూర్తి నిర్లక్ష్యంగా తలెగరేశాడు.

''చెప్పి తీరాలి!'' లలిత కళ్ళల్లో నిప్పులు కురిసాయి.

''ఏమిటి దబాయిస్తున్నావ్? నోర్మూసుకుని...'' మాణిక్యాంబ గయ్‌మని లేచింది.

''ఆ పనేదో ముందు మీరు చేసి కూర్చోండి. మీ కనవసరమైన విషయంలో తల దూర్చవద్దు. ఏం? నేనంత లోకువ గా ఉన్నానా మీకు? ఎందుకలా గొంతు చించుకుంటారు నామీద? నా అన్నయ్య ఇన్నాళ్ళతర్వాత నా ఇంటి గుమ్మంలోకొస్తే అన్నం వండి పెట్టడం పాపమా? నా తాతది కాదు... నాదే ఉంది. నా''బోడి సంపాదన''మీరు వాడుకుంటూ నాచేత ఇంట్లో చాకిరీ చేయించుకుంటోంది చాలక ఇంకా ఎందుకిలా మాటలతో నన్ను హింసిస్తారు? సహనానికీ ఓ హద్దు ఉంది. పెళ్ళయినప్పట్నుంచీ మీ చేష్టలను భరిస్తూ వచ్చాను. ఇంక సహించలేను''– ఇన్నాళ్ళూ మనసులో బద్దలవు తున్న అగ్ని పర్వత జ్వాలల్ని పైకి వెళ్ళగక్కింది లలిత.

రామ్మూర్తి కాసేపు కలా నిజమా అన్నట్టు చూశాడు.

ఆ తర్వాత విసురుగా లేచి పట్టరాని కోపంతో లలితను ఈడ్చి కొట్టాడు.

''నోర్మూసుకుని పో లోపలికి'' అన్నాడు హుంక రిస్తూ.

లలిత నాదెబ్బ-అభిమానాన్ని, మనసునీ గాయపరి చింది.

''వెళ్ళను. ముందీ విషయం తేలాలి. ఎందుకు నామీద చెయ్యి చేసుకున్నారు. నేనసలు మీ దృష్టిలో మనిషినేనా? పెళ్ళికి ముందు ఎన్ని వాగ్దానాలు చేశారు? అవన్నీ ఏమయినాయి?''


''ఇప్పుడవన్నీ అనవసరం.''

''సరే... వాడినెక్కడికి పంపారు? వెళ్ళిపొమ్మన్నారా?''

లలిత కళ్ళముందింకా అన్నకోసం వడ్డించిన విస్తరే కనబడుతోంది.

''సిగరెట్ల కోసం పంపాను. ఎక్కడికి పోతాడు... వండి వార్చావుగా! అదంతా మెక్కి ఇక్కడే తిష్ట వేస్తాడులే''

ఒక్కొక్క మాటా ఒక్కొక్క సమ్మెట దెబ్బలా తగిలింది లలితకి.




'పనీ పాటా లేకుండా ఊరంతా తిరిగి వచ్చే మరిది, ఆడబిడ్డా, పోసుకోలు కబుర్లతో కాలక్షేపం చేసే అత్త గారు, ఇంతమంది తన సంపాదన తిని తన్నే హీనంగా చూస్తున్నారు. వీళ్ళంతా తినగా లేనిది, తన తోడబుట్టిన వాడు, మతి చలించినవాడు, అమాయకుడు ఇన్ని రోజులకు ఇంటికి వస్తే— ఒక్క పూట అన్నం పెట్టడం వీళ్ళ దృష్టిలో ఎంత హేయంగా ఉంది!'వాళ్ళ నీచ బుద్ధికి లలితకి అసహ్యమేసింది.

'ఇక్కడ తిరిగి, అక్కడ తిరిగి ఎవరైనా పిలిచి పిడికెడన్నం పెడితే తిని, ఏ అరుగుమీదో పడుకుని, తరిమి కొడితే పరిగెడుతూ, గాలి వాటంగా ఇక్కడికొచ్చి మళ్ళీ మాయమైపోయే చలపతి అంటే వీళ్ళకెంత హేళన! చలపతిని మెంటల్ హాస్పిటల్‌లో ఉంచేయాలని తనెంత గానో ప్రయత్నించింది. ఈ రామ్మూర్తి పడనిచ్చాడా? రావడం ఆలస్యం, తన చేతిలో జీతం లాగేసుకుని ఒస్ ఛార్జీలకిస్తాడు. అంతే... మిగతా డబ్బు ఏమైపోయినా తను అడగకూడదు. అట్లాంటిది ఏం పెట్టి చలపతిని హాస్పిటల్‌లో ఉంచుతుంది? నెలనెలా వాళ్ళకి కట్టాల్సిన డబ్బు ఎక్కడ్నుంచి తెస్తుంది? హాస్పిటల్‌లో ఉంచితే

## గీత్‌మాల క్యాసెట్ గెలుచుకున్న కవిత



# పిల్లల పండుగ

నెహ్రూ చాచా జిందాబాద్!
పిల్లల జేజికిదే జోహార్!

పిల్లల కన్నుల తళతళలు
పిల్లల బుగ్గల మిలమిలలు
పిల్లల నవ్వుల కిలకిలలు
పిల్లల గుండెల కలకలలు
జలజల కురిసే పండుగరా,
పిల్లల పండుగ నేడేరా! ...


పసిపిల్లల లేలేత కనులలో
భారత మాతను చూచెనట -
పసిపాపల చిరునవ్వు సిరులలో
బంగరు కలలే కాంచెనట -
బాలలె వెన్నెల లన్నాడు
బాలల జాబిలి జవహరుడు! ...

మనిషి గుండెలో రోజాలు
మొగ్గ తొడిగి విరబూయాలి!
మంచి వాసనల వీచికలో
మనుషులందరూ బ్రతకాలి!
రోజా రాజా జవహర్‌లాల్
ప్రజలకు చూపిన బాటే మేల్! ...

ఎక్కడ చాచా? ఏమైనాడు?
ఏ స్వర్గములో వున్నాడు?
పూల రేకులో, పాప పెదవిలో
చిరు చిరు నవ్వై వున్నాడు -
చల్లగ మనలను దీవిస్తూ
ఎల్లవేళలా వుంటాడు!

—కలువకొలను సదానంద

నవంబరు 14 నెహ్రూ జయంతి




ఇట్లా రోడ్లంట తిరిగి అందరి దృష్టిలో ముష్టివాడుగా, పిచ్చివాడిగా హేళనైపోకుండా పడి ఉండేవాడు. తల్లీ, తండ్రీ లేకపోయారు. చెల్లెలై ఉండీ వాడికేం చెయ్య గలుగుతోంది తను...' దుఃఖం ముంచుకొచ్చింది లలితకు. పరుగున వంటింట్లోకి పోయి మోకాళ్ళలో తల దూర్చి వెక్కి వెక్కి ఏడవసాగింది.

లలిత చర్య అందర్నీ ఆశ్చర్యపరచింది. ఆమె ఇట్లా ఎప్పుడూ ప్రవర్తించలేదు. ఎన్ని అన్నా తలొంచుకుని పని చేసుకుపోయేది. అందరి మనసుల్లోనూ కాస్త బెదురు కలిగింది ఇది దేనికి దారితీస్తుందోనని.

రామ్మూర్తి వంట ఇంటి గడపదాకా వచ్చాడు.

"ఎందుకా ఏడుపు ఎవరో వచ్చినట్టు? నీలాంటిదే మొగుడ్ని కొట్టి మొగసాలకెక్కిందిట! సిగ్గు లేదూ? నోర్మూసుకో ముందు!"

లలిత చివ్వున తలెత్తి చూసింది. ఆ కళ్ళు మండిన పూవుల్లా ఉన్నాయి. వాటికే శక్తి వుంటే రామ్మూర్తి బూడిదై ఉండేవాడాక్షణాన.

"ఏమిటట్లా చూస్తావ్? కొడ్తావా?" అన్నాడు రామ్మూర్తి ఓ అడుగు ముందుకేసి.

లలిత రామ్మూర్తినీ, వంట గదిలో వడ్డించిన విస్తరినీ మార్చి మార్చి చూసింది. దిగ్గున లేచి పడగ్గదిలో కెళ్ళింది. తన శాలరీ బాగ్‌లోనే ఉంది. తన వస్తువులన్నీ సూట్‌కేస్‌లో సర్దుకొని వీధి గుమ్మం వైపు నడిచింది.

"ఎక్కడికి? నీకేం మతిపోయిందా?" అన్నాడు రామ్మూర్తి గాభరాగా.

"అవును... పిచ్చాడి చెల్లెల్నేగా... నాకూ మతి పోయింది. అందుకే ఆ మతిపోయిన వాడికోసం పోతు న్నాను. గుడ్‌బై... అన్నట్టు... నాది బోడి సంపాదనే కదా! ఇన్నాళ్ళూ పాపం నా బోడి సంపాదనతో కాక మీరే నన్ను పెట్టి పోషించారు. థాంక్స్. ఇంకా మీకా శ్రమ ఎందుకు? వస్తాను. నాకోసం మీరెవరూ రానక్కర్లేదు. వస్తే మర్యాదగా ప్రవర్తించను... జాగ్రత్త!" గడప దాటింది లలిత.



# రక్తదోషాంతక్*

**ఆహ్లాదకరమైన రుచిగల ఆయుర్వేదపు సౌందర్య సుధ**

రక్త దోషాంతక్....రక్తంలోగల దోషాలను తొలగించి మొటిమలను, మచ్చలను వేళ్ళతో సహా నిర్మూలిస్తుంది. చాలావరకు సౌందర్య సాధనాలు చర్మపు పైభాగం మీద మాత్రం పనిచేసి మొటిమలను, మచ్చలను తొలగిస్తాయి. కాని ఆయుర్వేద ప్రాచీన పరంపరననుసరించి చేయబడిన రక్త దోషాంతక్ రక్తాన్ని శుద్ధిచేసి, లోపాలను సమూలంగా నిర్మూలిస్తుంది.
మీ సౌందర్యపు సాధనానికి పునాది స్వచ్ఛమైన రక్తమే. ఇందువల్ల ఆయుర్వేదపు రక్త దోషాంతక్ తీసుకొని రక్తాన్ని శుద్ధంగా, స్వచ్ఛంగా ఉండేలా చూసుకోండి. మచ్చలేని సౌందర్యాన్ని వరంగా పొందండి.

మోతాదు: నాలుగు చిన్న చెంచాల మందు, రోజుకు రెండుసార్లు భోజనం తర్వాత తీసుకోండి.




* వారి రిజిస్టర్డ్ ట్రేడ్ మార్క్

ఆఫాలీ ఫార్మసూటికల్స్ లిమిటెడ్

AD HOUSE 903 TEL